ప్రజాశక్తి
ఆదివారం 24 డిసెంబర్ 2023

క్లస్టర్ విధానం హేయమైన చర్య

ప్రజాశక్తి-పార్వతీపురం

పశుసంవర్ధక శాఖలో పారా వెటర్నరీ సిబ్బందిని ఒత్తిడికి గురి చేస్తూ, వారి హోదాలను, సేవలను అవమానపరిచే విధంగా క్లస్టర్ విధానం తీసుకుని రావడం హేయమైన చర్యని ఆంధ్రప్రదేశ్ నాన్ రెగ్యులర్ వెటర్నరీ అసోసియేషన్ మన్యం జిల్లా అధ్యక్షులు జి.నాయుడు అన్నారు. శనివారం పార్వతీపురం ఎన్‌జిఒ కార్యాలయంలో జరిగిన ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లస్టర్ విధానంలో పశుసంవర్ధక శాఖ ఉద్యోగులతో పాటు, ప్రజలకు కూడా తీవ్ర ఇబ్బందని , ఈ విధానం రద్దు చెయ్యాలని కోరారు. సమావేశంలో చైర్మన్ ఎన్.శ్రీనివాసులునాయుడు, వైస్ చైర్మన్ జి.రమణమూర్తి, క్రాంతికుమార్, అప్పలనరసమ్మ, స్వర్ణలత తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగో(మా)ల్

- అంతంత మాత్రంగానే సేకరణ
- బ్యాంకు గ్యారంటీలు లేక ట్రక్ షీట్ల కోసం ఎదురుచూపులు
- చిన్న, సన్నకారు రైతులకు తప్పని రవాణా అవస్థలు
- వ్యవసాయ శాఖ సిబ్బంది ఇచ్చిన నాణ్యతా ప్రమాణాలను తప్పపడుతున్న మిల్లర్లు
- క్వింటాకు 5 కిలోలు అదనంగా డిమాండ్ చేస్తున్న వైనం

కళ్లాల్లోనే ఉన్న ధాన్యం

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఈ ఏడాది ధాన్యం కొనుగోలు ప్రక్రియ మొత్తం గందరగోళంగా తయారైంది. జిల్లాలో సుమారు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ అంచనా. ఆ ప్రకారమే జిల్లా పౌర సరఫరాల శాఖ ఇప్పటికే ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించింది. నేటి వరకు 45 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయినట్లుగా అధికార యంత్రాంగం లెక్కలు చెబుతోంది. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అంతా అస్తవ్యస్తంగా మారి రైతులను అయోమయానికి గురిచేస్తోంది. రైతులు ధాన్యం అమ్మకానికి మిల్లులకు తగిన బ్యాంకు గ్యారంటీ లేకపోవడం, ట్రక్‌సీట్లు జనరేట్ కాకపోవడం వల్ల లోడింగ్ చేసిన ధాన్యంతో వాహనాలు రోజులు తరబడి నిలిచిపోతున్నాయి.

రైతన్నకు రవాణా కష్టాలు

ఇప్పటికే జిల్లాలో ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉన్న రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదిస్తున్నారు. రవాణా సౌకర్యం అంతంతమాత్రంగా ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు సొంతంగా రవాణా ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిన్న, సన్న రైతులు తాము పండించిన రెండు మూడు ఎకరాల ధాన్యాన్ని అమ్ముకోవడానికి తగిన రవాణా సౌకర్యం లేక, సొంతంగా రవాణా ఏర్పాటుకు కావాల్సిన చిన్న వాహనాలు అందుబాటులో లేక నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ఏదో ఒక విధంగా రవాణా సౌకర్యం ఏర్పాటు చేసుకున్నా ట్రక్ షీట్ జనరేట్ కాకపోవడంతో రోజుల తరబడి వాహనాలు ధాన్యం లోడింగ్‌తో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులు సొంతంగా రవాణా ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నా వాహనాల యజమానులు ఆసక్తి చూపడం లేదు. దీనికి తోడుగా ప్రభుత్వం చెల్లించే రవాణా ఛార్జీలు గిట్టుబాటు కావని, అదనంగా మరికొంత మొత్తాన్ని రైతుల నుంచి వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ వసూలు

రైతులు పండించిన ధాన్యాన్ని వ్యవసాయ శాఖ సిబ్బంది పరీక్షించి ఇచ్చిన నాణ్యతా ప్రమాణ పత్రాన్ని మిల్లర్లు తప్పుపడుతున్నారు. రైతు తీసుకొచ్చిన ధాన్యాన్ని మిల్లులో తాము ఏర్పాటుచేసిన నాణ్యతా పరికరంలో మిల్లర్లు పరీక్షిస్తున్నారు. అక్కడ నాణ్యతా లోపం పేరుతో రైతు నుండి క్వింటాకు 5 కిలోల చొప్పున అదనంగా డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే ధాన్యం అన్‌లోడ్ చేయించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. దీనికి తోడుగా అన్‌లోడ్ ఛార్జీలు కూడా రైతుల నుండే వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికే తాము వ్యవసాయ శాఖ సిబ్బందికి, ధాన్యం కొనుగోలు సిబ్బందికి తెలియజేసినా ప్రయోజనం లేదని ఆవేదన చెందుతున్నారుక. తప్పనిసరి పరిస్థితుల్లో మిల్లర్ల డిమాండ్ చేసిన ధాన్యాన్ని అదనంగా చెల్లించుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు.

సందర్శనలు తప్పితే తనిఖీలు లేవు

కళ్లాల వద్దనే కొనుగోలంటూ చెప్పి తమను పాలకులు, అధికారులు మోసం చేశారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో కొంతమంది పైస్థాయి అధికారులు పర్యవేక్షించినా కేవలం ధాన్యం కొనుగోలు నియమ నిబంధనలను గూర్చి అవగాహన కల్పిస్తున్నారు. అంతేతప్ప క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వాటికి పరిష్కారాలు చూపడం లేదు. బస్తాకు 40 కిలోల ధాన్యం మాత్రమే ఇవ్వాలని అధికారులు చెబుతున్నా మిల్లర్లు 42 కిలోలు చొప్పున డిమాండ్ చేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించే సమయంలో ధాన్యం బస్తాలను తనిఖీ చేస్తే అక్రమాలన్నీ బయట పడతాయని చెబుతున్నారు.

ఆ బాధ్యత అధికారులదే

రైతులు పండించే ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఉన్న సాంకేతిక కారణాలను పరిష్కరించాలి. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఆటంకమూ లేకుండా చర్యలు తీసుకోవాలి. నాణ్యత లోపం పేరుతో మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

- రెడ్డి లక్ష్మునాయుడు,
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కాంతారావు

సమగ్రశిక్ష ఉద్యోగులపై చిన్నచూపు

జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కాంతారావు ● కళ్లకు గంతలతో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సమగ్రశిక్ష ఉద్యోగుల రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా శనివారం పార్వతీపురంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు. ఈ శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ పిఆర్‌సి అమలు చేయకుండా, నెలల తరబడి వేతనాలు విడుదల చేయకపోవడం దుర్మార్గమన్నారు. మినిమం టైమ్‌స్కేల్‌పై జిఒలు విడుదల చేసినా అమలు చేయడం లేదన్నారు. ఉద్యోగుల మధ్య విభేదాలు, విభజన సృష్టించే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని విమర్శించారు. ఉద్యోగ సంఘాలతో మాట్లాడే సంప్రదాయాన్ని గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రాజెక్టులో ఒకే కేడర్ ఉద్యోగులకు రకరకాల వేతనాలు చెల్లిస్తూ, కొత్త విధానాలకు తెరలేపారని మండిపడ్డారు. పార్ట్ టైం పేరుతో తక్కువ జీతాలు ఇచ్చే విధానాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. కొన్ని విభాగాలకు, కెజిబివి టీచర్లకు అరకొర జీతాలు పెంచి చేతులు దులుపుకున్నారని తెలిపారు. ఎన్నికల కంటే ముందు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని హామీనిచ్చి ఏ ఒక్క సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం చూపలేదన్నారు. వెంటనే డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి సిపిసి మన్యం జిల్లా అధ్యక్షులు చుక్క గణపతి, జెఎసి జిల్లా నాయకులు ఎ.పోలినాయుడు, బి.ఈశ్వరరావు, సిహెచ్.భానుప్రకాశ్, ఎ.దివాకర్, కె.భారతి, జి.రమేష్, వై.గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మద్దతు

నిరవధిక సమ్మె చేపడుతున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మథరావు ఒక ప్రకటనలో మద్దతు తెలిపారు. న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.

మహిళా పోలీస్‌కు ఎస్‌ఐ పోస్టు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురం సచివాలయంలో మహిళా పోలీస్‌గా పనిచేస్తున్న భవ్య ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపికైంది. నర్సిపురం గ్రామానికి చెందిన వెంపల గురురాజు అనురాధ కుమార్తె వెంపల భవ్య.. ఇంజినీరింగ్ విద్యనభ్యసించి, సచివాలయ మహిళా పోలీస్ పరీక్షలకు హాజరై, ఎంపికైంది. అదే గ్రామంలో సచివాలయ మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తోంది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో ఎస్‌ఐగా ఎంపికైంది. మహిళా పోలీస్ నుంచి ఎస్‌ఐగా మారిన భవ్యను గ్రామస్తులు అభినందించారు.

వెంపల భవ్య

పార్వతీపురంలో చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

చెప్పిన మాట మరిచారు..

- వినూత్నరీతిలో అంగన్వాడీల నిరసనలు
- 12వ రోజుకు నిరవధిక సమ్మె

చెవిలో పూలు పెట్టారు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మాటతప్పని మడమ తిప్పని ముఖ్యమంత్రి చెప్పిన మాటలు, ఇచ్చిన హామీలను మరిచిపోయి అంగన్వాడీలో చెవిలో పూలు పెట్టారని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మథరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లాలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 12వ రోజుకు చేరింది. పార్వతీపురంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు మర్రాపు అలివేలు, సాలూరు గౌరీమణి ఆధ్వర్యంలో సమ్మె శిబిరం కొనసాగించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా వినూత్నరీతిలో అంగన్వాడీలు చెవిలో పువ్వులు పెట్టుకుని వెంకటేశ్వర స్వామి చిత్రపటానికి పూలు, విన్నపాలు సమర్పించి నిరసన తెలిపారు. అంగన్వాడీల నిరసనకు మన్మథరావు, వెంకటరమణ మద్దతు తెలిపి, మాట్లాడారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను నెరవేర్చే వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టంచేశారు. అంగన్వాడీలకు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కాంతారావు, సిఐటియు నాయకులు బొత్స లక్ష్మి, బంకురు సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, ఉత్తరాంధ్ర పార్టీ నాయకులు మెట్టు రామారావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ లీడర్స్ టి.రాజేశ్వరి, బి.నీలవేణి, పార్వతి, ధర్మావతి, కె.రాజేశ్వరి, ఎం.గౌరీ, బి.శాంతి, బి.సునీత, కల్పన, జయలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

సీతంపేట : సీతంపేట ఐటిడిఎ కార్యాలయం ఎదుట నిర్వహించిన అంగన్వాడీల సమ్మె శనివారానికి 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలు చెవుల్లో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శి ఎస్.సురేష్, ఎం.కాంతారావు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు, ఎ.పార్వతి, ఎ.దర్శిమి, సహాధ్యక్షులు అంజలి, గిరిజన సంఘం నాయకులు సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండల కేంద్రంలో అంగన్వాడీ ధర్నా శిబిరాన్ని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పల్లి శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావు, గౌరవాధ్యక్షులు తీళ్ల మధుసూదనరావు, నాయకులు అంది పోలినాయుడు, బూరాడ ఆదినారాయణ సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతి కుమారి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గవర వెంకటరమణ, అంగన్వాడి యూనియన్ నాయకులు మరడ సత్యవతి, పి.యశోద, వంగపండు లక్ష్మి, కె.శైలజ, మరిచర్ల సునీత పాల్గొన్నారు.

సాలూరులో రిలే దీక్షలు చేస్తున్న అంగన్వాడీలు

సాలూరు : 12రోజు సమ్మెలో భాగంగా అంగన్వాడీ యూనియన్ పట్టణ అధ్యక్షులు బి.రాధ, మండల అధ్యక్షులు ఎ.నారాయణమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ఆధ్వర్యాన రిలే దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామల, వరలక్ష్మి, తిరుపతమ్మ, పార్వతి, శశికళ పాల్గొన్నారు.

కొమరాడ : 12వ రోజు సమ్మెలో భాగంగా అంగన్వాడీలు కొమరాడలో నిరసన దీక్ష చేపట్టారు. అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ సెక్టార్ లీడర్లు బి.అలివేలు, జ్యోతి, మల్లేశ్వరమ్మ, పద్మ, లలిత, మాధవి, జయమ్మ, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, తెలుగు రైతు నాయకులు బత్తిలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో చెవిలో పూలు పెట్టుకుని అంగన్వాడీలు నిరసన చేపట్టారు. వీరికి సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, అభ్యుదయ రైతు ఖండపు ప్రసాదరావు మద్దతు తెలిపారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్. హిమప్రభ, పాలకొండ ప్రాజెక్టు అధ్యక్షులు జి.జెస్సీ బాయ్, బి.అచ్చమ్మ, బి.జ్యోతి, కె.సీతమ్మ, ఎన్.ప్రమీల, కె.పావని, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని 12 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. శనివారం గుమ్మలక్ష్మీపురంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే అంగన్వాడీలతో కలిసి ఐక్యంగా పోరాడుతామని హెచ్చరించారు. ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు పాట పాడుతూ అంగన్వాడీలను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు సత్యవతి, కస్తూరి పాల్గొన్నారు.

లోకేష్ అరెస్టుకు కుట్ర

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌ని అరెస్టు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు జి.సంధ్యారాణి ఆరోపించారు. శనివారం సాలూరులో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కుట్రపూరితంగా అరెస్టు చేసి జైల్లో పెట్టారని చెప్పారు. దాని వల్ల చంద్రబాబుకు ప్రజాదరణ పెరిగిందని చెప్పారు. అది చూసి కడుపుమంటతో సిఎం జగన్ ఇప్పుడు లోకేష్ అరెస్టుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు ఎదుర్కోనున్న సిఎం జగన్‌కి గిరిజనులు ఇప్పుడు గుర్తుకు రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ పేరుతో పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో సిఎం జగన్ మోహన్ రెడ్డి పర్యటించడం వెనుక ఉద్దేశం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ ప్రాంతంలో ఉన్న బాక్సైట్, ఇతర గనులలపై ప్రేమతో ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

26 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

ఈ నెల 26 నుంచి మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మెను జయప్రదం చేయాలని మున్సిపల్ కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ పాదయాత్రలో, అసెంబ్లీలో మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని, సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. నాలుగున్నరేళ్లు గడుస్తున్నా నేటికీ అమలు చేయలేదని చెప్పారు. మంత్రులకు, అధికారులకు అనేక పర్యాయాలు వినతి పత్రాలు ఇచ్చామని గుర్తుచేశారు. అయినా ఫలితం లేకపోవడంతో సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతున్నట్లు చెప్పారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు ఎన్.శంకర్రావు, సిహెచ్.సింహాచలం, మామిడి శివ, ఎన్.మల్లేష్, బంగారు రవి, నిర్మల, ఎం.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు వెంకటరమణ

ప్రభుత్వ మెడకు వ్యతిరేక ఉచ్చు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం మెడకు ఉద్యోగులు, స్కీమ్‌వర్కర్ల వ్యతిరేక ఉచ్చు బిగుసుకుంది. హామీల అమలు, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండడంతో వీరంతా ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. మరోవైపు ప్రభుత్వ విధానాలపై రైతుల్లోనూ అసహనం పెరుగుతోంది. ఓవైపు వివిధ తరగతులకు చెందిన ప్రజానీకం నిరసన హోరు తారా స్థాయికి చేరుతుంటే, ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' అంటూ కొత్త ఆటకు తెరలేపింది. మరోవైపు ప్రభుత్వంతోపాటు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు రాజకీయ చదరంగంలో బిజిబిజీగా ఉన్నారు. బహుశా అందుకేనేమో గడిచిన పది రోజులుగా జిల్లా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన దీక్షలతో అట్టుడుకుతున్నా, పలు రంగాలకు చెందిన స్కీమ్ వర్కర్లు సమ్మెసైరన్ మోగించినా స్పందించడం లేదు. పైగా బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చినఅప్పలనాయుడు 'ఒళ్లు బలిసి రోడ్లమీదకు వస్తున్నారు' అంటూ అంగన్‌వాడీలపై అణుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై అంగన్‌వాడీలతోపాటు పలు ట్రేడ్ యూనియన్లు, ఉద్యోగ, కార్మిక సంఘాలు కూడా ఘాటుగానే స్పందించడంతో ఆ ఎమ్మెల్యేకు తిరిగి సమాధానం చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఈ సంగతి కాస్త అటుంచితే, తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలోకి దిగి 12 రోజులు కావస్తోంది. ఇప్పటి వరకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించ లేదు. పైగా సమ్మె విరమించాలంటూ జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ నిన్నగాక మొన్న విశాఖపట్నంలో కోరారు. రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో అసలు వేతనాలు పెంచే ప్రసక్తే లేదని తెగేసి చెప్పేశారు. తగ్గేదే లే అన్నట్టుగా అంగన్‌వాడీలు తమ సమ్మెను కొనసాగించడంతోపాటు మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతున్నారు. ఈనేపథ్యంలో సిపిఎం తదితర వామపక్ష పార్టీలు మరో అడుగు ముందుకు వేసి, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే తమ ప్రత్యక్ష మద్ధతు ప్రకటిస్తామని చెప్పాయి. ఇప్పటికే నల్ల రిబ్బన్లు కట్టుకోవడం, మోకాళ్లపై నిలబడడం, వంటావార్పు, ధర్నాలు, రాస్తారోకో తదితర రూపాల్లో నిరసన వ్యక్తం చేసిన అంగన్‌వాడీలు మౌనం వీడి సిఎం జగన్, వైసిపి ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా గళం

విప్పుతూ ఆటపాటలకు తెరలేపారు. మరోవైపు తాళాలు పగలుగొట్టి మరీ సచివాలయ ఉద్యోగులతో కేంద్రాలను తెరిపిద్దామని ప్రభుత్వం భావించిన పరిస్థితుల్లో పిల్లల తల్లిదండ్రులు కూడా అంగన్‌వాడీలకే మద్ధతు తెలపడంతో ప్రభుత్వ వ్యూహం బెడిసికొట్టింది. ఈనేపథ్యంలో ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామంటూ అంగన్‌వాడీలు దీక్షబూనారు. ఇంకోవైపు తమ సమస్యలు పరిష్కరించకపోతే ఖబడ్ధార్ అంటూ ఆశావర్కర్లూ ఆందోళన చేస్తున్నారు. సర్వశిక్షాభియాన్ పరిధిలోని 18 విభాగాలకు చెందిన కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నాలుగు రోజులుగా సమ్మెబాట పట్టారు. అంగన్‌వాడీలు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మెను ఆదర్శంగా తీసుకున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, గ్రామాల్లో గ్రీన్ అంబాస్‌డర్లు కూడా తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 26నుంచి సమ్మెలోకి వెళ్తామంటూ ఇప్పటికే కమిషర్లకు సమ్మెనోటీసులు అందజేసిన సంగతి తెలిసిందే. విఆర్‌ఎగా ప్రమోషన్ ఇవ్వడంతోపాటు పేస్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ విఆర్‌ఎలు ఆందోళన బాటపట్టారు. ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఇటీవల కాలంలో ఇరు జిల్లాల్లోనూ ర్యాలీలతో నిరసన తెలిపారు. తమకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, పని ఒత్తిడి, వేధింపులకు పాల్పడుతున్నారని, ఉపాధ్యాయులు చాలా కాలంగా గుర్రుగా ఉన్నాయి. ధరలో దగా, తూకంలో మోసం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు, రైతు సంఘం నాయకులు వినతులు, వార్నింగులతో ప్రభుత్వ వైఖరిని ఎండగడుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వం భరతం పడతామంటూ సిపిఎం ఆధ్వర్యాన వామపక్ష పార్టీలన్నీ ఇటీవల ఒక్క తాటిపైకి వచ్చిన సంగతి తెలిసిందే. జిల్లాలో జ్యూట్, చక్కర పరిశ్రమలను తెరిపించాలని, కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, తోటపల్లి, జంఝావతి సహా అనేక గెడ్డలపై ప్రతిపాదనలోవున్న మినీ రిజర్వాయర్లను నిర్మించాలని, మన్యం జిల్లాలో మెడికల్ కాలేజీ నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని, గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన ఇటీవలే సమర శంఖారావం మోగించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వానికి ఇవేవీ పట్టకపోవడంతో కేవలం ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లే కాకుండా రైతులు, పేద, మధ్యతరగతి ప్రజానీకంలో వ్యతిరేకత పెరుగుతోంది.

రైల్వేస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, స్థానికులు

కొమరాడలో రాయగడ ఎక్స్‌ప్రెస్ నిలపాలి

ప్రజాశక్తి-కొమరాడ

రాష్ట్ర సరిహద్దు ప్రాంతం నుంచి ప్రయాణికుల అవసరం మేరకు గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు కొమరాడ రైల్వే స్టేషన్ వద్ద శనివారం ధర్నా చేపట్టారు. అనంతరం స్టేషన్ మాస్టర్ ఎస్ఎస్ సాహు సింగ్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం సాంబమూర్తి, తెలుగు రైతు నాయకులు బత్తిలి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ-రాయపూర్ రైలు సమయాన్ని మార్చాలని కోరారు.

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని నిరసన

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్తు ఛార్జీలు తక్షణమే తగ్గించాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మక జయరాజ్ ఆధ్వర్యాన శనివారం కురుపాం సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లు కరెంట్ ఛార్జీలు పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతోందన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు నడుకూరు దూశేశ్వరరావు, ఆగూరు వైకుంఠరావు, పత్తిక లక్ష్మయ్య, గండి మురళి, తిరుపతిరావు పాల్గొన్నారు.

26 నుంచి సోషల్ ఆడిట్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఉపాధి హామీలో గతేడాది నిర్వహించిన పనులకు గాను ఈ నెల 26 నుంచి జనవరి 9 వరకు సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎపిఒ శివరామకృష్ణ తెలిపారు. చాపరాయిబిన్నిడి, నెల్లికెక్కువ, ఇరిడి, గుమ్మలక్ష్మీపురం పంచాయతీల్లో ఈ నెల 26న గ్రామసభ నిర్వహించనున్నామని చెప్పారు. 27న బాలేశు, రాయగడ జమ్ము, 28న దుడ్డుఖల్లు, 29న వనజాలి, 30న తాడికొండ, జర్న, చిన్నగీసాడ, జనవరి 2న బీరుపాడు, 3న లక్కగూడ, గొయిపాక, 4న ఎల్విన్‌పేట, కేదారిపురం, దుమ్మంగి, 5న చెముడుగూడ, కొండవాడ, 6న లుంబేసు, 7న పి.ఆమిటి, 8న వంగర, మండ, నోండ్రుకోన, 9న కుక్కిడి, పెద్దఖర్జ రెల్ల పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తామని వివరించారు. ఆయా పంచాయతీల్లో ప్రజలు గ్రామసభల్లో పాల్గొని సోషల్ ఆడిట్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

బ్యాంకు సేవలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులు అర్హత బట్టి బ్యాంకులు అనేక రకాలైన సేవలను అందిస్తాయని ఎస్‌బిఐ కేదారిపురం బ్రాంచ్ డిప్యూటీ మేనేజర్ కె.జయరాం అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకులు కల్యాన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినియోగదారుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సేవింగ్ అకౌంట్స్, లోన్స్ ఎలిజిబిలిటీ, మనీ ట్రాన్స్‌ఫర్, బ్యాంకు ఇన్సూరెన్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి బ్యాంకుకు సంబంధించిన అనేక విషయాలపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించారు. మనీ ట్రాన్స్‌ఫర్ విషయంలో అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపల్ టి.శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు ప్రభుత్వం కల్పించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు రామయ్య, త్రినాథ్ పాల్గొన్నారు.

జిల్లా వినియోగదారుల సంఘం సభ్యులు రాధను సత్కరిస్తున్న ప్రిన్సిపల్

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-సాలూరు

వినియోగదారుల చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా వినియోగదారుల సంఘం సభ్యులు బి.రాధ కోరారు. శనివారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కన్స్యూమర్ క్లబ్ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థులు వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకుని తల్లిదండ్రులకు సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు. వస్తువులు కొనుగోలు సందర్భంగా, సేవలు పొందేటపుడు విధిగా రశీదు తీసుకోవాలని కోరారు. నాణ్యతా లోపాలుంటే వెంటనే సంబంధించిన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం ఆమెను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసమూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒలు డాక్టర్ చిరంజీవులు, ఎటిఎస్ నాయుడు దుశ్శాలువాతో సన్మానించారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ త్రినాథరావు శనివారం బహుమతులను అందజేశారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన పోటీల్లో విజేతలకు వాటిని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రామారావు, రామకృష్ణ, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా చదవాలి

ప్రజాశక్తి-సీతానగరం

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని డిపిఒ బి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని బూర్జి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివితే, మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.కె.వర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

ప్రజాశక్తి-వీరఘట్టం

శ్రీ గాయత్రీ కళాశాల ఆవరణలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ ఎలీషా, కళాశాల కస్పాండెంట్ ఎస్.లోకేష్, ప్రిన్సిపల్ కె.సింహాచలం, పి.స్వర్ణ శ్యామ్, ఎన్.మానస భాస్కర్, ఎన్.విజయ జీవ, ఎస్.శశిభూషణరావు, సురేంద్ర, రాజేష్, ఎస్.నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

సృజనా స్ఫూర్తి... వైజ్ఞానిక దీప్తి

ప్రజాశక్తి-పార్వతీపురం

విద్యార్థుల సృజనాత్మక స్ఫూర్తి వెల్లివిరిసింది. వినూత్న ఆలోచనల వైజ్ఞానిక ప్రదర్శనలు అందరినీ ఆలోచింపజేసి, అబ్బురపరిచాయి. స్థానిక డివిఎం స్కూల్లో విద్యా శాఖ ఆధ్వర్యాన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన శనివారం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక నమూనాల ప్రదర్శనలు తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పాఠాలు బోధించడంతోపాటు విద్యార్థుల్లో ఇమిడి ఉన్న శాస్త్రీయత, సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తరగతి గది నుంచే వినూత్న ఆలోచనలకు బీజం వేసి బావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు తోడ్పాటు అందించాలన్నారు. విద్యార్థి దశ నుంచే సృజనను ప్రోత్సహిస్తూ, సామాజిక అంశాలనే పరిశోధనలకు ఎంచుకొని కొత్త ఆలోచనలతో ప్రతిభ చూపాలని సూచించారు. వైజ్ఞానిక ప్రదర్శనల్లో అవకాశాలు కల్పిస్తే ప్రతిభ బయటకు వస్తుందన్నారు. అందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.

డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాల, మండల స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లాలో మండలానికి మూడు కేటగిరీల చొప్పున వైజ్ఞానిక ప్రదర్శనలు పోటీలో నిలిచాయని తెలిపారు. విద్యా వైజ్ఞానిక పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఆర్.తేజేశ్వరరావు, ఎన్.ఉమామహేశ్వరరావు, జి.తులసి వ్యవహరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోని గౌరీశ్వరి, పాలకొండ డిప్యూటీ డిఇఒ డి.గోపాలకృష్ణ, ఎంఇఒలు వై.విమలకుమారి, కె.ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు బి.గోవింద, జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు, జిల్లా కో ఆర్డినేటర్ పి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు గురించి జెసికి వివరిస్తున్న విద్యార్థి

10న కలెక్టరేట్ వద్ద ధర్నా

గిరిజనులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన ప్రాంతంలో చెక్‌డ్యాములు, రోడ్లు, వంతెనలు నిర్మించాలని జనవరం పదో తేదిన కలెక్టరేట్ వద్ద ధర్నా, ర్యాలీ చేపడుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. శనివారం మండలంలో వలసబల్లేరు, వలసగూడ , మొండెంఖల్, దురిబిలి, తెనుఖర్జ, రస్తాకుంటుబాయి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో మొగలిరేకులు, కీడుగెడ్డ చెక్‌డ్యాములు, పలు గెడ్డలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అనేక కొండ ప్రాంతాల్లో రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మరమ్మతులకు వంతెనలు బాగుచేయాలన్నారు. ప్రతి గిరిజన గ్రామానికి మంచినీరు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

వలసగూడలో ఆవిరిగెడ్డ గ్రామ సమీపాన కోతకు గురైందన్నారు. పక్కనే పెద్దలోయ ఉందని, ఇక్కడ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ఈ లోయకు రిటైనింగ్ వాల్ నిర్మించాలని కోరారు. గిరిజనుల సమస్యలపై చేపడుతున్న ధర్నాకు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, గిరిజనులు రమేష్, గణేష్, నీలకంటు, పత్తి, బిడ్డికి దశమి, రవికుమార్, పాలకు సుజాత, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి

రహదారులు ప్రారంభం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో నిర్మాణ పనులు పూర్తయిన పలు బిటి రహదారులను ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కురుపాం మండలంలో దండుసురగూడ నుండి పిటి మండల వరకు 5.7 కిలోమీటర్ల మేర రూ.5 కోట్లతో, జియ్యమ్మవలస మండలంలో టికెజమ్ము నుండి పల్లపు సిరిపి వరకు కిలోమీటర్ మేర రూ.57 లక్షలతో, పల్లపు సిరిపి నుండి నడింసిరిపి వరకు కిలోమీటర్ మేర రూ.64 లక్షలతో రోడ్లు పూర్తిచేసినట్లు తెలిపారు. దీంతో రవాణా సౌకర్యం మెరుగు పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ జె.శాంతీశ్వరరావు, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, వైసిపి మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, వైస్ ఎంపిపిలు బి.అన్నాజీరావు, రంగారావు, వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనాలని నేడు ధర్నా

ప్రజాశక్తి-కొమరాడ

రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని ఆదివారం అర్థం జంక్షన్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి, టిడిపి నాయకులు బి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం కొమరాడలో కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఇస్తామన్న గోనె సంచులు గాని, రవాణా ఛార్జీలు గాని, కలాసీ కూలి గాని రైతులకు చేరడం లేదని, దళారీలే లాగేస్తున్నారని చెప్పారు. తూనిక కన్నా అదనంగా ధాన్యం లాగేస్తున్నారని చెప్పారు. దీనిపై చేపట్టే ధర్నాను రైతులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం నాయకులు గండి జగన్నాథం పాల్గొన్నారు.

కొమరాడ, గుమ్మలక్ష్మీపురంలో ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గురుకుల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-కొమరాడ

జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో అండర్-17 విభాగంలో కొమరాడ గిరిజన సంక్షేమ గురుకుల బాలురు పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపల్ లక్ష్మణరావు తెలిపారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్, ఇతర సిబ్బంది శనివారం అభినందించారు. గురుకుల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవశం చేసుకున్నారు. అథ్లెటిక్స్‌లో కె.శ్రీను అత్యధిక పతకాలు సాధించి, వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ని సాధించాడు. గురుకుల విద్యార్థులు 8 బంగారు, 7 వెండి, 3 కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ వివరించారు. వీరు ఈనెల 28 నుంచి పాచిపెంట మండలం పి.కోనవలస గురుకులంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం : జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్లో భద్రగిరి గిరిజన గురుకుల పిటిజి బాలికల పాఠశాలకు ఆల్‌రౌండ్ ఛాంపియన్షిప్ లభించింది. వాలీబాల్ లో మొదటి స్థానం లభించింది. ఇండివిడ్యువల్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో ప్రణీతకు మొదటి స్థానం లభించిందని ప్రిన్సిపాల్ యుగంధర్, పిడి చంద్రమౌళి, పిఇటి అరుణ తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులను ఒప్పించాలి

హౌసింగ్ అధికారులతో ఐటిడిఎ పిఒ సమీక్ష

ప్రజాశక్తి-సాలూరు

పేదల గృహ నిర్మాణంలో లబ్ధిదారులను ఒప్పించి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ ఆదేశించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ టి.జయరాం, హౌసింగ్ డిఇ సోమేశ్వరరావు, ఎఇలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం నెలిపర్తి లేఅవుట్‌ని పరిశీలించారు. వివిధ స్థాయిల్లో నిలిచిపోయిన గృహ నిర్మాణాలు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పునాదులు, శ్లాబ్ స్థాయిలో నిలిచిన ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇలు తెంటు శ్రీనివాసరావు, సత్యనారాయణ, మున్సిపల్ ఎఇ సూరినాయుడు పాల్గొన్నారు.

నెలిపర్తి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని బీరుపాడు ఆశ్రమ పాఠశాల, దేరువాడ ఎంపిపి పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.గంగారాం డిమాండ్‌చేశారు. శనివారం మండలంలోని బీరుపాడు, దేరువాడ పాఠశాలలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 36 మంది విద్యార్థులున్న బీరుపాడు ప్రాథమిక ఆశ్రమ పాఠశాలలో సైన్స్, సోషల్ సబ్జెక్టు టీచర్స్, పిటి లేరని, రెగ్యులర్ వార్డెన్ లేకపోవడం వల్ల టీచర్, వార్డెన్ బాధ్యతలు ఒక్కరే చూడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం కుక్‌ను కేటాయించకపోవడం చాలా దారుణమన్నారు. పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో కుక్కలు, పశువులు గదుల్లోకి చొరబడి నాశనం చేస్తున్నాయని తెలిపారు. పాతకాలపు భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితుల్లో విద్యార్థులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే శిథిల భవనాన్ని కూల్చివేసి నూతన భవనాన్ని, ప్రహరీ గోడ నిర్మించాలని డిమాండ్‌చేశారు. అనంతరం దేరువాడ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతూ 53 మంది విద్యార్థులకు సొంత పాఠశాల భవనం లేకపోవడం వల్ల సంత రేకుషెడ్డులో తరగతులు నిర్వహిస్తుడడం అన్యాయమన్నారు. వెంటనే నాడు-నేడులో నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బి. రమేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే పౌష్టికాహారం

ప్రజాశక్తి - కురుపాం

ప్రకృతి వ్యవసాయంతోనే పౌష్టికాహారం అందించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.మధుసూదన్‌రావు అన్నారు. మండలంలో రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో ఐదు రోజుల నుంచి నిర్వహిస్తున్న మెంటర్స్, ఫార్మర్ సైంటిస్టుల ముగింపు శిక్షణ కార్యక్రమానికి శనివారం ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తమ క్షేత్రాల్లో అమలు చేయడంతోపాటు రైతుల ద్వారా చేయించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పెట్టుబడులు తగ్గడంతోపాటు దిగుబడులు పెరుగుతాయని చెప్పారు. ఆరోగ్యకర పంటలు పండించవచ్చని తెలిపారు. అనంతరం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా జిల్లా సమైక్య అధ్యక్షులు ఆరిక శాంతికి, కొండబారిడి గ్రామానికి చెందిన పత్తిక సుశీలను సన్మానించారు.

కార్యక్రమంలో డిపిఎం పి.షణ్ముఖరాజు, శాస్త్రవేత్తలు జి.అమృతవీణ, ఉమాజ్యోతి, డిపిటి మానస, ఎన్ఎఫ్ఎలు దేవిప్రసాద్, జి.అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులను సత్కరిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

రైతులకు సత్కారం

ప్రజాశక్తి-సీతానగరం

జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా బుడ్డిపేట, గెడ్డలుప్పి గ్రామాల్లో రైతులు, కౌలురైతులను డిఐఒ డాక్టర్ టి.జగన్మోహనరావు శనివారం శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కష్టపడి వ్యవసాయం చేస్తూ మనకు ఆహారం అందిస్తున్నారని, రైతే దేశానికి వెన్నెముకని కొనియాడారు. రైతులను ప్రతిఒక్కరూ ఆదరించి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు తిరుపతి నాయుడు, వార్డు మెంబర్ ఎస్. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని బూర్జ, కామన్నదొరవలస, కృష్ణరాయపురం గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను శనివారం ఇఒపిఆర్‌డి కె.కె.వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్తులు, సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలను పరిశీలించి, ఏవైనా తప్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు జి.అన్నంనాయుడు, దాసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి పూర్తి చేయాలని నిరసన

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టం ప్రధాన రహదారి పనులు పూర్తి చేయాలని శనివారం టిడిపి, జనసేన ఆధ్వర్యంలో రోడ్డుపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ వీరఘట్టం ప్రధాన రహదారి పనులు చేపట్టి మూడేళ్లు కావస్తున్నా పూర్తి కాలేదంటే పాలకుల పనితీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. ప్రతిరోజూ వందలాది భారీ వాహన రాకపోకల వల్ల దుమ్ము, ధూళి ఎగరడంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నట్లు తెలిపారు. నిమ్మక నిబ్రం మాట్లాడుతూ రహదారి పనులు పూర్తి చేయకపోతే రానున్న రోజుల్లో మరిన్ని ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి చింత ఉమామహేశ్వరరావు, ఎన్.శశికుమార్, జనసేన నాయకులు ఎం.పుండరీకం, వజ్రగడ జానీ, కె.సాయి పవన్, బి.నీలకంఠంనాయుడు, వై.అప్పల నాయుడు, బి.హరిబాబు, టి.రమేష్, డి.రాజు పాల్గొన్నారు.

వీరఘట్టం ప్రధాన రహదారిలో నిరసన తెలియజేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

తోటపల్లికి పోటెత్తిన జనం

ప్రజాశక్తి- గరుగుబిల్లి

ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం తోటపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి జనం పోటెత్తారు. యాత్రికులకు ఉత్తర(వైకుంఠ) ద్వార దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు వి.వి అప్పలాచార్యులు ఆధ్వర్యంలో రామాలయం నుంచి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. ఎఎస్‌పి దిలీప్ ఆలయాన్ని సందర్శించారు. దాతలు బగ్గం మణిభూషణ్, లక్ష్మి దంపతుల సహకారంతో ఉచిత ప్రసాదంగా అందజేశారు. ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జ్యోతి దంపతుల ఆధ్వర్యాన అన్నదానం ఏర్పాటుచేశారు. సిఐ అమ్మనరావు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆలయ ఇఒ వి.వి.సూర్యనారాయణ యాత్రికులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, సభ్యులు గౌరీశంకర్ పాత్రో, గంటేడ సింహాచలం నాయుడు, కుసుమూరు సాగర్, ఇందుమతి పాల్గొన్నారు.

తోటపల్లి ఆలయం వద్ద బారులు తీరిన యాత్రికులు

సీతంపేట : వైకుంఠ ఏకాదశి కావడంతో మండలంలో టిటిడి ఆలయానికి భారీగా యాత్రికులు తరలివచ్చారు. పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు ఆలయాన్ని సందర్శించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మూడు వేల మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, రాము, ఎంపిటిసి పగడాలమ్మ, దేవాలయం ఇన్స్పెక్టర్ రాంబాబు, సిబ్బంది గోవిందరావు, సర్పంచులు కళావతి, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.